

## ఆరోగ్య 'కుసుమ'

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే కుసుమ నూనె వాడకం ఎక్కువైంది.

వివరాలు 8లో ▸



## వంతెనలు 'హై లెవెల్'..

నాచారం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం లోని లోలెవెల్ వంతెన పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

వివరాలు 9లో ▸



## రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| గురువారం | శుక్రవారం |
| సా. 6.31 గం. | ఉ. 5.03 గం. |

## న్యూస్‌రీల్


### 16న మహిళా జాబ్‌మేళా

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



దుబ్బాక: పట్టణంలో ఈనెల 16న మహిళల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని కొంగర్ కలాన్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ(ఎంఎన్‌సీ)లో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకే జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ అర్హతలు ఉన్న మహిళలకు ఈ కంపెనీలో అవకాశాలున్నాయన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని ఆసక్తి గల మహిళలు తమ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

### డీసీసీబీ చైర్మన్‌కు పితృ వియోగం



చిట్టి రాంరెడ్డి(ఫైల్)

కొండపాక(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తండ్రి చిట్టి రాంరెడ్డి(80) హైదరాబాద్‌లో మృతి చెందారు. స్వగ్రామమైన కొండపాకలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ దిలీప్ నాయక్, సీఐ లతీఫ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు డీసీసీబీ చైర్మన్‌ను పరామర్శించి ఓదార్చారు.

### పుస్తక ప్రదర్శన



కళాశాలలో పుస్తకాలు వీక్షిస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): దశాబ్ది కార్యక్రమాల సందర్భంగా వర్గల్ జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం లైబ్రరీ డే నిర్వహించారు. ఆకట్టుకున్న ఈ మహా పుస్తక ప్రదర్శనలో గ్రంథాలయంలోని 22,241 గ్రంథాలను ప్రదర్శించారు. ఇందులో 9,062 రెఫరెన్స్ బుక్స్, 2,233 డొనేషన్ ద్వారా సమకూరిన బుక్స్, 676 పోటీ పరీక్షల పుస్తకాలు, 9,376 పాఠ్యాంశ సంబంధ బుక్స్, 894 జనరల్ బుక్స్, 11 పీరియాడికల్స్, 6 దినపత్రికలున్నాయి. ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, లైబ్రేరియన్ బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పుస్తక ప్రదర్శన తిలకించారు.

# కొత్త కాలనీలు.. కంపు కంపు

**సిద్దిపేట మున్సిపాలిటీలో సమస్యలు కోకొల్లలు**

- పేరుకే ఆదర్శం.. అంతా అధ్వానమే..
- అస్తవ్యస్తంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ
- పలు కాలనీలలో రోడ్లు, వీధి దీపాలు కరువు
- పార్కులు, ఓపెన్ జిమ్‌లపై కానరాని పర్యవేక్షణ
- ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా పట్టించుకోని అధికారులు

**సాక్షి విజిట్‌లో వెగులుచూసిన వాస్తవాలు**

ఒకప్పుడు అన్నింటా ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట మున్సిపాలిటీని.. ఇప్పుడు అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో కొత్త కాలనీలు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా విలీన వార్డుల్లో వీధి దీపాలు, అంతర్గత రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. అలాగే పలు కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులు, ఓపెన్ జిమ్‌లను పట్టించుకోకపోవడంతో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కాలనీలో కొత్తగా ఇంటి నిర్మాణం ఎక్కడ జరిగితే అక్కడ పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వాలిపోయి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

సిద్దిపేటజోన్: స్మార్ట్ సిటీ లక్ష్యంగా పట్టణంలో రూ.300 కోట్లతో 274కిలోమీటర్ల పొడవునా మూడు దశల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు రెండు దశల్లో పనులు పూర్తి అయ్యాయి. పలు చోట్ల చిన్న వర్షాలకే డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. దీంతో మురుగు రోడ్లపై ఏరులై పారుతోంది. ఫలితంగా ఆ మార్గం గుండా వెళ్లాలంటేనే జనం ఇబ్బంది పడుతున్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్టీసీ పెట్రోల్ పంప్ దగ్గర మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నాయి. పట్టణ పరిధిలోని మారుతినగర్, ప్రియదర్శినగర్, మైత్రివనం ఫేస్–2, హరిప్రియానగర్, గాడిచర్లపల్లి, సుడా కార్యాలయం బ్యాక్‌సైడ్, టీహెచ్‌ఆర్ కాలనీ, వడ్డెర కాలనీ యూజీడీ లేకపోవడంతో పలు చోట్ల రోడ్ల పైకే నీటి వృథాగా వదిలేస్తున్నారు.

### అంధకారంలో కాలనీలు..



కొత్త కాలనీలైన మైత్రీవనం ఫేజ్–2, మారుతినగర్, టెలికాంనగర్, ఆదర్శనగర్, కేసీఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో అవసరాలకు అనుగుణంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసినా వాటికి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి అయ్యిందంటే చాలు అంధకారంలో మగ్గుతున్నాయి. రాత్రి వేళ స్థానిక ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇక వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

### దోమల స్వైరవిహారం

పలు కాలనీలలోని ఖాళీ స్థలాల్లో చెత్తదారం, వర్షపు నీళ్లు నిలుస్తున్నాయి. మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణంలో 43 వార్డులుండగా ఒకే ఫాగింగ్ మిషన్ ఉంది. దీంతో దోమల నియంత్రణ కరువైంది. దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దోమలు కుట్టడంతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఫుట్ పాత్‌ల ఆక్రమణ..



సిద్దిపేట మున్సిపాలిటీలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫుట్ పాత్‌లను ఏర్పాటు చేశారు. మెదక్, హైదరాబాద్, కరీంనగర్ మార్గంలో ఉన్న ఫుట్‌పాత్ లను ఆక్రమించి కొందరు వ్యాపారం చేస్తున్నారు. నడవడానికి అవకాశం లేక పాదచారులు రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరైతే ఫుట్‌పాత్‌లపైనే పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తుండటం గమనార్హం. అధికారులు కాసులకు ఆశపడి పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

### అలంకారప్రాయంగా సిగ్నల్స్



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకరణ ప్రాయంగా మారుతున్నాయి. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి కొన్ని కూడళ్లలో ఉంది. ముఖ్యంగా సుభాష్ రోడ్, కమాన్‌రోడ్, మార్కెట్ రోడ్ నిత్యం రద్దీగా ఉంటోంది. ఇరుకైన రహదారుల వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.



నర్సాపూర్ చెరువులో గుర్రపు డెక్క

### చెరువుల్లో గుర్రపు డెక్క

మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎర్రచెరువు, నర్సాపూర్ చెరువులు గుర్రపు డెక్కతో నిండిపోయాయి. కోమటిచెరువు కెనాల్‌లో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయి. ప్రధాన కాలువ చుట్టూ బఫర్ జోన్‌లలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

### పేరుకే రైతు బజార్లు



పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి బల్దియాలో రైతు బజార్లు ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లతో పాటు మరో నాలుగు రైతు బజార్లు ఉన్నాయి. కానీ వీటిలో కొన్ని వినియోగంలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పట్టణంలో ఇష్టానుసారంగా వివిధ ప్రాంతాల్లో మాంస విక్రయాలు జరగడంతో నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు లక్ష్యం నీరు గారుతోంది. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

### మున్సిపాలిటీ స్వరూపం..

- మున్సిపాలిటీ ఏర్పడిన సంవత్సరం: 1952
- విస్తీర్ణం: 54.55చదరపు కిలోమీటర్లు.
- జనాభా: 1,77,879
- వార్డులు: 43
- రెవెన్యూ జోన్‌లు:17
- పట్టణంలో ఇళ్లు: 42,325
- మంచినీటి పథకాలు: యశ్వడ.. మిషన్‌భగీరథ
- పట్టణానికి అవసరమైన తాగునీరు: 21.20 ఎంఎల్‌డి..
- చెత్త సేకరణ వాహనాలు: 51
- పబ్లిక్ టాయిలెట్స్: 48
- వీధి దీపాలు: 15,000
- బస్తీ దవాఖానాలు: 3
- స్వయం సహాయక సంఘాలు: 2,147
- వీధి వ్యాపారులు: 7,768

### అధ్వానంగా పార్కులు..



సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కులపై పర్యవేక్షణ కరువైంది. పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీ, మైత్రీవనం, నెహ్రూపార్క్, విక్టరీ టాకీస్ దగ్గర పార్కులున్నాయి. చాలా పార్కులలో ఊయల, వివిధ ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. అలాగే పార్కులో వాటర్ ఫౌంటేన్ వృథాగా దర్శనమిస్తోంది. పార్కులలో మొక్కలకు నీటిని అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది.









### రహదారులు నిర్మించాలి



కొత్తగా ఏర్పడిన కాలనీలలో మౌలిక వసతులు లేవు. ముఖ్యంగా యూజీడీ లీకేజీలను అరికట్టాలి. కాలనీలో నీటి వసతి కల్పించాలి. ఎలాంటి వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– నాగరాజు, ప్రియదర్శిని కాలనీ, సిద్దిపేట

### వసతుల లేమితో తిప్పలు



మున్సిపాలిటీలోనే మొట్ట మొదటి గేటెడ్ కమ్యూనిటీ మాది. గతంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాం. ప్రస్తుతం సిద్దిపేట మున్సిపాలిటీలో విలీనం అయ్యింది. ఆస్తి, నల్లా పన్నుల చెల్లింపు మేరకు వసతులు కల్పించాలి.

– చంద్రం, హరిప్రియ రెసిడెన్సీ, సిద్దిపేట

### వాకర్స్‌కు ఇబ్బందులు



చెరువు పరిసరాల్లో వాకింగ్ చేసే వాకర్స్‌కు గుర్రపు డెక్కల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అధికారులు చొరవ చూపి వాటిని తొలగించాలి. కోమటిచెరువు కెనాల్‌ను శుద్ధిచేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– దేవాచారి, సిద్దిపేట

### ప్రాధాన్యత క్రమంలో వసతులు



మున్సిపాలిటీ క్రమంగా పెరుగుతోంది. కొత్తగా కాలనీలు ఏర్పడుతున్నాయి. ప్రజలకు మౌలిక వసతులు అందించే బాధ్యత మాదే. ప్రాధాన్యత క్రమంలో అన్ని వసతులు కల్పిస్తాం. స్వచ్ఛ సిద్దిపేట సాధిస్తాం.

– అశ్రిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్

# ఇప్పటికీ గ్రౌండింగ్ నో



సాక్షి, సిద్దిపేట: ఎస్సీ కార్పొరేషన్ ఎకనామిక్ సపోర్ట్ స్కీం కింద పలువురికి సబ్సిడీ విడుదలై ఆరు నెలల నుంచి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాలేదు. ఎస్సీలకు చేయూతను అందించేందుకు 60శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. బ్యాంక్‌కు సంబంధం లేకుండానే థర్డ్ పార్టీ పేరుతో సబ్సిడీలు 34 మంది పేర్ల మీద రూ.1.20కోట్లు విడుదల అయ్యాయి. అందులో 75శాతం పైగా యూనిట్లు గ్రౌండింగ్ కాలేదు. ఇది అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**ఇద్దరు కలిసి కాజేశారా?**

అసలు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారులకు అందయా?.. లేక గతంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి, కింగ్ బుక్‌స్టాల్ యజమాని ఇద్దరు కలిసి కాజేశారా అని అనుమానాలు రేకెత్తుతున్నాయి. రూ.1.20కోట్లు ఎటు వెళ్లాయని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అధికారిక వెబ్‌సైట్‌లో గ్రౌండింగ్ కాలేదని తేటతెల్లం అవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. లబ్ధిదారుల పేరుతో వీరిద్దరే సబ్సిడీ డబ్బులను మాయం చేశారని తెలుస్తోంది. దీని పై ఉన్నత స్థాయి అధికారి నియమించి క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే ఆక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**గోల్‌మాల్ పై జోరుగా చర్చ**

ఎస్సీ కార్పొరేషన్‌లో సబ్సిడీ గోల్‌మాల్ అయ్యాయని వార్త ప్రచురితం కావడంతో జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చ సాగింది. పలు దళిత సంఘాలు ఎస్సీ కార్పొరేషన్ ఎండీకి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### కథల వల్ల పఠన వికాసం

చిన్నకోడూరు(సిద్దిపేట): కథలు రాయడం వలన విద్యార్థులలో సృజనాత్మకత వికాసం చెందుతుందని, తద్వారా వారిలో పుస్తక పఠన అభిరుచి పెరిగి చదువులో రాణిస్తారని సుగుణ సాహితి సమితి జిల్లా కన్వీనర్ భైతి దుర్గయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో సుగుణ సాహితి సమితి ఆధ్వర్యంలో ఉడాధి కథల పోటీలు నిర్వహించారు. బాల కథలలో విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కథల ద్వారా చదవడం, వ్రాయడం పై ఆసక్తి పెరుగుతుందన్నారు. కథలు రాసిన 22 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

# మజీద్‌పల్లిలో వెటర్నరీ బృందం

- కోళ్లఫారాలు పరిశీలన
- కోళ్ల మృతిపై ఆందోళన వద్దు
- జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ వెల్లడి



పౌల్ట్రీఫారాలను పరిశీలిస్తున్న వెటర్నరీ అధికారులు

వర్గల్(గజ్వేల్): మజీద్‌పల్లిలోని కోళ్ల ఫారాలను వెటర్నరీ బృందం సందర్శించింది. 'కోళ్లకు ఏమైంది' శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ అశోక్‌కుమార్ స్పందించారు. క్షేత్రస్థాయి పరిశీలన, వివరాలు శాంపిల్స్ సేకరణ నిమిత్తం సిద్దిపేట ఏడీ కొండల్‌రెడ్డి, సంగారెడ్డి పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ పవన్‌కుమార్, వేలూరు పశువైద్యాధికారి డాక్టర్ సర్వోత్తమ్‌తో కూడిన బృందాన్ని వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి పంపించారు. క్షేత్రస్థాయిలో వీరు కోళ్ల ఫారాలను పరిశీలించారు. కోళ్లు చనిపోయిన తీరు, తదితర వివరాలను సేకరించారు. కోడిపిల్లలను అందజేసే కంపెనీ సంబంధీకులు ముందురోజే మిగతా కోళ్లను 'కల్లింగ్' చేసి తరలించినట్లు, కోళ్ల ఫారాలను శానిటైజ్ చేయించినట్లు గుర్తించారు. ఫారాలలో కోళ్లు లేకపోవడంతో శాంపిల్స్ సేకరించలేదు. పౌల్ట్రీ నిర్వాహకులకు, కోడిపిల్లలు ఇచ్చే కంపెనీల ప్రతినిధులకు పలు ముందస్తు జాగ్రత్తలు సూచించారు. పౌల్ట్రీ రైతులు తమ ఫారాలలో పెద్దసంఖ్యలో కోళ్లు మృతిచెందినట్లు గమనిస్తే వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కోళ్ల మృతిపై జేడీ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

**చికెన్ నిరభ్యంతరంగా తినొచ్చు**

కోళ్ల మృతిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, నిరభ్యంతరంగా చికెన్ తినొచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉడకబెట్టిన వంటకాలలో వైరస్ ప్రభావం ఉండదన్నారు. చికెన్ తదితర వంటకాలను 100 డిగ్రీల ఉష్ణోగ్రత దాకా ఉడికించి తయారుచేయడం సాధారణమేనన్నారు. అందువల్ల వైరస్ ప్రభావం ఎంత మాత్రం ఉండదని, చికెన్‌పై, కోళ్ల మృతిపై ఆందోళన అవసరం జేడీ స్పష్టం చేశారు.

### సబ్సిడీ డిపాజిట్ చేయండి

**లబ్ధిదారులకు బ్యాంకర్ల ఆదేశం**

సాక్షి ఎఫెక్ట్

హుస్నాబాద్‌రూరల్: బ్యాంకుల ప్రమేయం లేకుండా నేరుగా ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు పొందిన లబ్ధిదారులకు బ్యాంకర్లు ఫోన్ చేశారు. మా బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసిన డబ్బులు డిపాజిట్ చేయాలని ఆదేశించారు. బుధవారం 'సబ్సిడీ గోల్‌మాల్' శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన కొందరు లబ్ధిదారులు నంగునూరు మండలం పాలమాకులకు చెందిన ఒక మధ్యవర్తి సహాయంతో కార్పొరేషన్ రుణాలను పొందారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారుడు ఒకరు మూడు నెలల కిందటే ఎలాంటి యూనిట్ ఏర్పాటు చేయకుండానే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.6లక్షల రుణం విత్‌డ్రా చేసుకున్నాడు. రుణం ఇప్పించిన మధ్యవర్తి.. తన కమిషన్ రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా లబ్ధిదారుడు స్పందించలేదు. ఎస్సీ కార్పొరేషన్ అక్రమాలు 'సాక్షి'లో రావడంతో యూనియన్ బ్యాంకు అధికారులు సదరు ఖాతాదారుడిని పిలిపించి డబ్బును డిపాజిట్ చేయించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. బ్యాంకు రుణం ఇవ్వకుండానే రుణం ఎట్లా వచ్చిందని బ్యాంకు అధికారులు సదరు ఖాతాదారుడిని ప్రశ్నించి ఖాతాను హోల్డులో పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

# భూసేకరణ ప్రక్రియ వేగిరం చేయండి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులతో సమావేశం

సిద్దిపేటరూరల్: ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ వారికి కేటాయించిన భూముల సేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా కేటాయించిన ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూములు వెరిఫై చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి ఎస్టిమేట్ చేసి టీజీఐఐసీ అధికారులకు పత్రాలు అందించాలన్నారు. డ్రోన్ ద్వారా భూసేకరణ కొలతలు తీసుకుంటే సులభంగా వేగంగా జరుగుతుందని, ఈ పనిని ఎప్పటికప్పుడు ఆర్డీఓలు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, టీజీఐఐసీ జోనల్‌మేనేజర్ అనురాధ, డీజీఎం ఉమామహేశ్వర్, డీఈ జ్యోతి, సర్వేల్యాండ్ ఏడీ వినయ్‌కుమార్, ఏఓ రెహమన్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోండి**

సిద్దిపేటరూరల్: ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ లో అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, తహసీల్దార్, ఎంపీఓ, ఎంపీడీఓ, లేఅవుట్ యజమానులతో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాటు యజమానులు ఈనెలాఖరులోపు 25 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే పరిష్కరించుకోవాలని తెలిపారు.

**ఈనెలాఖరులో పనులు పూర్తి చేయాలి**

సిద్దిపేటరూరల్: ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన సీసీరోడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల్లో మరుగుదొడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు తదితర నిర్మాణ పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి ఎంబీ రికార్డ్ చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

## క్లుప్తంగా

### బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంపై ఉచిత శిక్షణ

- 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- టీజీబీసీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ దయాసాగర్

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంపై నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టీజీబీసీ స్టడీ సర్కిల్ సిద్దిపేట డైరెక్టర్ కృష్ణ దయాసాగర్ బుధవారం తెలిపారు. ఈ శిక్షణ హైద్రాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెనింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తయి, 26 ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 15 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఏప్రిల్ 12 నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రంలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు టీజీబీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### పార్టీ బలోపేతమే లక్ష్యం

**గజ్వేల్‌రూరల్:** పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ

**కొండపాక(గజ్వేల్):** కుకునూరుపల్లి హైస్కూల్‌కు లయన్స్, స్నేహ క్లబ్‌లు సంయుక్తంగా విద్యార్థులకు బుధవారం కెరియర్ గైడెన్స్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధి విజయభాస్కర్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల అనంతరం ఉన్నత చదువుల్లో చేరేందుకు ఈ పుస్తకాలు ఉపయోగపడుతాయన్నారు. పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5వేలు పారితోషికం అందజేస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, క్లబ్ ప్రతినిధులు పరమేశ్వర్ చారి, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మినీ వాటర్‌ప్లాంట్ వితరణ

**వర్గల్(గజ్వేల్):** మండల పరిధిలోని నాచారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం జూబ్లి హిల్స్ రోటరీక్లబ్ రూ.85 వేలు విలువైన మినీ వాటర్‌ప్లాంట్, విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేసింది. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు బాలకోటారెడ్డి, లక్ష్మి, విజయలక్ష్మి, రాజా కిషన్, హెచ్‌ఎం ఉమారాణి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో చేరండి

**సిద్దిపేటఎడ్యుకేషన్:** ఇంటర్మీడియెట్ పూర్తికాగానే డిగ్రీ కోర్సుల కోసం తమ కళాశాలలో చేరాలంటూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థినులను కోరారు. ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, అధ్యాపకులు ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాల వద్ద బుధవారం విద్యార్థినులను కలిసి కరపత్రాలను పంచారు. కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఈ లైబ్రరీ, ఐసీటీ క్లాస్‌రూంలు ఉన్నాయని వారికి వివరించారు.

### మెరుగైన వైద్యమే లక్ష్యం

**గజ్వేల్‌రూరల్:** ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు సుఖేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, రాములుగౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### విస్తరాకుల్లో మధ్యాహ్న భోజనం



**అక్కన్నపేట(హుస్నాబాద్):** మండల పరిధిలోని అంతక్కపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం విస్తరాకుల్లో భోజనాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మోహన్‌నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి విద్యార్థుల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. అందులో భాగంగా విస్తరాకుల్లో భోజనం వడ్డించేలా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దీంతో పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యానికి ఎటువంటి హానీ జరగదని వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం సీఏలు రంగమ్మ, అంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఓ వ్యక్తికి రిమాండ్

**నంగునూరు(సిద్దిపేట):** కోర్టు పేషీలకు హాజరుకాని ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఆసీఫ్ తెలిపారు. దర్గపల్లికి చెందిన ఆసర్ల యాదయ్యపై 2021లో రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో కోర్టు పేషీలకు హాజరుకావడం లేదు. దీంతో బుధవారం అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అరెస్టు వారెంట్ జారీ చేయడంతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



విద్యార్థులతో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇతర అధికారులు



మహిళా దినోత్సవ వేడుకల్లో సీపీ, పోలీసు అధికారులు, మహిళలు

# సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- కలెక్టర్ రాహుల్ రాజ్
- మెదక్ కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

**మెదక్ కలెక్టరేట్:** సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఐడీఓసీని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళా శానిటేషన్ సిబ్బందిని, మహిళా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. అదే విధంగా వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులను, ఉత్తమ మహిళా ఉద్యోగులను ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులను ప్రదానం చేశారు. గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, డీడబ్ల్యూ హైమావతి, అదనపు డీఆర్డీఓ సరస్వతీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మీ, ఎస్సీ సంక్షేమ అధికారిని శశికళ, గిరిజన సంక్షేమ అధికారిని నీలిమ , మెప్మా పీడీ ఇందిరా, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, సీడీపీఓలు స్వరూప, హేమ భార్గవి, వెంకటరమణ, పద్మలత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట సీపీ అనురాధ
- పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో మహిళా దినోత్సవం

**సిద్దిపేటకమాన్:** మహిళల సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సీపీ బుధవారం కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు చదువు చాలా ముఖ్యమన్నారు. విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలన్నారు. తల్లిదండ్రులు ఇంట్లో మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా చూడాలన్నారు. జిల్లాలో మహిళలు, పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పోలీస్ సిబ్బందికి నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారిని సీపీ అభినందించారు. అనంతరం మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, సీఐలు విద్యాసాగర్, విష్ణు ప్రసాద్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ పెట్రోల్ బంకు

**ప్రారంభించిన కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ**

**సిద్దిపేటఅర్బన్:** పోలీస్ శాఖకు చెందిన పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ ఎలాంటి కల్తీ లేకుండా క్వాలిటీగా క్వాంటిటీగా ఉంటుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులో పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కలెక్టర్, సీపీ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్ శాఖ పెట్రోల్ పంపు ద్వారా వచ్చే ఆదాయం పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. పోలీస్ కన్వెన్షన్ ద్వారా వచ్చే ఆదాయం సైతం పోలీస్ వెల్ఫేర్ సొసైటీకి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, రవీందర్, ఆర్ఐలు విష్ణుప్రసాద్, రాజేష్, ఐఓసీ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, సిద్దిపేట మేనేజర్ అమిత్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్, శ్రీధర్‌గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీసీ నితిన్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళ దారుణ హత్య

- ఖాదిరాబాద్ గ్రామంలో విషాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ సత్తయ్య



గౌరమ్మ (ఫైల్)

**వట్‌పల్లి(అందోల్):** మహిళ దారుణ హత్యకు గురైన ఘటన జోగిపేట పోలీస్‌సర్కిల్ పరిధిలోని వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొట్టె గౌరమ్మ(45) భర్త వీరప్ప పదేళ్ల కిందట మృతి చెందాడు. కుమారుడు హైద్రాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ అక్కడే ఉంటుండగా, గౌరమ్మ స్వగ్రామంలో ఒక్కతే ఉంటుంది. ప్రతి రోజూ ఉదయమే లేచే ఆమె బుధవారం లేవకపోవడంతో చుట్టుపక్కల వారు వెళ్లి తలుపులు కొట్టారు. స్పందించకపోవడంతో కిటికీలోంచి చూడగా మంచంపై ఉన్న బట్టలు కాలిపోయి పొగలు వస్తుండగా, పక్కనే గౌరమ్మ కిందపడి ఉంది. వెంటనే తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా చనిపోయి ఉంది. పక్క గ్రామంలో ఉన్న మృతురాలి సోదరుడు వీరేశంకు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ సత్తయ్య గౌడ్ వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి మెడపై గాయాలు ఉండటంతో హత్య జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు జాగిలాన్ని తెప్పించి విచారణ చేపట్టగా హత్య జరిగిన ప్రదేశంలో కారం చల్లడంతో జాగిలం ఇంటి నుంచి కొంత దూరం వెళ్లి ఆగిపోయింది. మృతురాలి వీరేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అగ్నికి ఆహుతి.. నష్టాన్ని మిగిల్చి



కాలిపోయిన మక్కచేను

### మక్క చేను దగ్ధం

**మిరుదొడ్డి(దుబ్బాక):** ప్రమాదవశాత్తు మక్క చేను దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు మంతూరి కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం .. రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ కరెంటు తీగలు ఒకదానికొకటి రాపిడై నిప్పు రవ్వలు ఎగసి పడటంతో మక్క చేను కాలి బూడిదైపోయింది. ఇందులో మక్క పంటతోపాటు, ఎకరంలో వేసిన డ్రిప్ పైపులు, గేట్ వాల్లు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు తనకు నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరాడు.



దగ్ధమైన మామిడి తోట

### చిన్నకోదూరులో మామిడి తోట

**చిన్నకోదూరు(సిద్దిపేట):** ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మామిడి తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలోని రామంచ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎడ్ల బాల్‌రెడ్డికి 10 ఎకరాల మామిడి తోట ఉంది. ఆ తోటను సిద్దిపేటకు చెందిన రామోజీ లీజ్‌కు తీసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మామిడి తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలార్పినప్పటికీ తోట పూర్తిగా దగ్ధమైంది. తోటలో ఉన్న డ్రిప్ పైపులు కాలిపోయాయి. సుమారు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

# బీటీ రోడ్లకు మోక్షం

**18 రహదారులకు రూ.45 కోట్లు మంజూరు : హరీశ్‌రావు**

**సిద్దిపేటఅర్బన్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరై, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రద్దయ్యి ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.45 కోట్లు మంజూరు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులను రద్దు చేశారని పేర్కొన్నారు. ఆ పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 18 బీటీ రోడ్ల పనులను ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రామంచ-చంద్లాపూర్ పీఆర్ రోడ్డు నుంచి సిరిసిల్ల రోడ్డు వరకు రూ.1.97 కోట్లు, పెద్దకోదూరు నుంచి చిన్నకోదూరు వరకు రాజీవ్ రహదారిని కలిపే రోడ్డుకు రూ.1.52 కోట్లు, కిష్టాపూర్ ఎస్సీ కాలనీ నుంచి గుండారం వరకు బీటీ రోడ్డుకు రూ. 2.65 కోట్లు, సిద్దిపేట-హుస్నాబాద్ రోడ్డు నుంచి మిట్టపల్లి-మందపల్లి రోడ్డు వరకు రూ.4 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. బక్రిచెప్యాల నుంచి దర్గా, దుద్దెడ వరకు బీటీ రోడ్డుకు రూ. 3.43 కోట్లు, గట్లమల్యాల నుంచి ఆరేపల్లి మీదుగా కొండంరాజుపల్లి రోడ్డుకు రూ.4 కోట్లు, రంగాయపల్లి నుంచి తెనుగువానిపల్లి వరకు రూ. 2.66 కోట్లు, మాచాపూర్-రంగాయపల్లి పీఆర్ రోడ్డు నుంచి జంతు హాస్టల్ ద్వారా బీటీ రోడ్డుకు రూ.1.23 కోట్లు మంజూరని పేర్కొన్నారు. రాజీవ్ రహదారి నుంచి అనిమల్ హాస్టల్ మీదుగా పొన్నాల పీఆర్ రోడ్డు వరకు రూ.2.44 కోట్లు, చిన్నగుండవెల్లి నుంచి రాంపూర్ వరకు రూ. 2.25 కోట్లు, చిన్నగుండవెల్లి నుంచి ఇర్కోడు వరకు రూ. 4 కోట్లు, సిద్దన్నపేట నుంచి రాంపూర్ వరకు రూ.3.07 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సికింద్లాపూర్ నుంచి శివునిపల్లి మీదుగా చెర్ల అంకిరెడ్డిపల్లి వరకు రూ. 3.60 కోట్లు, కస్తూరిపల్లి నుంచిడి దర్గపల్లి వరకు రూ.2.03 కోట్లు, జక్కాపూర్ డబుల్ బెడ్రూంల వద్ద నుంచి కోడివారి కాలనీ మీదుగా జక్కాపూర్ వితలాపూర్ పీఆర్ రోడ్డు వరకు రూ. 2.88 కోట్లు, చంద్లాపూర్‌లోని కబీర్‌పల్లి నుంచి గంగాపూర్‌లోని పిట్టలవాడ వరకు రూ. 2.88 కోట్లు, నాగరాజుపల్లి నుంచి మాచిరెడ్డిపల్లి వరకు రూ. కోటి, వెంకటాపూర్ నుంచి అప్పలాయచెర్వు వరకు రూ. 75 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

## కాల్వలో పడి వ్యక్తి మృతి

**సంగారెడ్డి క్రైమ్:** కాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని సాయి నగర్ కాలనీకి చెందిన దానయాల ఆంజనేయులు గౌడ్ (48) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. 10న పని డబ్బులు తీసుకురావాలని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం శారద ఆస్పత్రి ఎదుట మురికి కాల్వలో మృతదేహమై కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు పరిశీలించగా బైపాస్‌లోని బెల్ట్ షాపులో మద్యం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. మద్యం మత్తులో మూత్ర విసర్జనకు వెళ్లి కాల్వలో పడి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## భార్యా బిడ్డలకు దూరమై.. జీవితమే భారమై

**బంగారం శుద్ధి చేసే విషం తాగి స్వర్ణకారుడు ఆత్మహత్య**



రాములు(ఫైల్)

**పాపన్నపేట(మెదక్):** మిల మిల మెరిసే బంగారు ఆభరణాలు తయారు చేసే అతడి కుటుంబ జీవితంలో చీకటి కోణాలు దాగి ఉన్నాయి. తాత్కాలిక ఆవేశాలతో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కొంప ముంచింది. రోజు వారి వేధింపులు భరించలేక ఇద్దరు బిడ్డలను తీసుకొని ఆ ఇల్లాలు పుట్టింటికి వెళ్లిపోయింది. మీరు లేని జీవితం నాకొద్దంటూ ఆ స్వర్ణకారుడు బలన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అవుసుల రాములు మేడ్చల్‌లో కుల వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య సరళ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ విషయంలో భార్యా భర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. సరళ కొద్ది రోజుల కిందట పిల్లలను తీసుకొని పుట్టినిల్లు ఎల్లారెడ్డికి వెళ్లి పోయింది. దీంతో తీవ్ర మనో వేదనకు గురైన రాములు స్వగ్రామమైన కొత్తపల్లికి వచ్చి బంగారం శుద్ధి చేసే విషం తాగాడు. బుధవారం గ్రామ శివారులోని మెయిన్ రోడ్డు పక్కన శవమై కనిపించాడు. మృతుడి తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

**జోగిపేట(అందోల్):** జోగిపేట పట్టణంలోని బజాజ్ షోరూం ఎదురుగా పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పాండు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి నిర్వహించగా గోపాల్, శ్రీశైలం, నాగరాజు, మల్లేశం, వెంకటేశం పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.47 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# 15 శాతం నిధులు కేటాయించాలి

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట వేయాలి
- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య



మాట్లాడుతున్న ఆదిత్య

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో జిల్లా కన్వీనర్ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సకలజనులు పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో మొదటి పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారన్నారు. నిధులు కేటాయించకుండా విద్యావ్యవస్థను గత ప్రభుత్వం అధోపాతాలానికి తొక్కితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్, అంబేద్కర్ జోనల్ ఇన్‌చార్జి అనీష్, నగర ఉపాధ్యక్షుడు భాను, నగర సంయుక్త కార్యదర్శి రాకేశ్, హరికృష్ణ, శ్రావణ్, మైపాల్ పాల్గొన్నారు.

**కలెక్టరేట్ వరకు పాదయాత్ర**

**సిద్దిపేటరూరల్:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 6.3 శాతం నిధులు కేటాయించి హామీని తుంగలో తొక్కిందన్నారు. ఈ బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని సీఎంకి విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఏగొండ, జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, పోతరాజు శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భ్యాగరి వేణు, బెజ్జెంకి తిరుపతి, దశరథం, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

# విదేశాలకు ఎగుమతితో మంచి లాభాలు

- ఏపీఈడీఏ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌పీ నాయుడు
- కేవీకేలో మామిడి రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీ నాయుడు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏపీఈడీఏ (అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌పీ నాయుడు సూచించారు. బుధవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీఈడీఏ ఆధ్వర్యంలో మామిడి సాగు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన మామిడి పంటను ఉత్పత్తి చేస్తే విదేశాలకు ఎగుమతి చేయొచ్చన్నారు. దీంతో అధిక లాభాలు వస్తాయన్నారు. విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వ లైసెన్స్ అవసరం ఉంటుందన్నారు. అనంతరం కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి పంట పిందె దశలో ఉన్నాయని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పూత పిందె రాలితే శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. మామిడి తోటను ప్రతి రోజూ గమనించి తెగులు, చీడపీడలు సోకకుండా చర్యలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌సింగ్, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్, నర్సాపూర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి సంతోష్, ఆయిల్‌ఫామ్ మేనేజర్ క్రిష్ణ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కుసుమ

**నూనెపై పెరిగిన అవగాహన**

- మార్కెట్‌లోనూ డిమాండ్
- పంటకు పూర్వ వైభవం
- జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో సాగు

**జహీరాబాద్ టౌన్:** కుసుమ రబీలో సాగు చేయు నూనె గింజ పంట. మార్కెట్‌లో నకిలీ నూనెలు కనిపిస్తున్న తరుణంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు కుసుమ నూనెను వాడుతుంటారు. ఈ నూనెను వాడడం వల్ల శరీరంలోని కొవ్వు శాతం తగ్గించి గుండె జబ్బులు, శ్వాస కోశ సమస్యల నియంత్రణకు ఉపయోగపడుతుంది. ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుండటంతో ఈ నూనె వాడకం ఎక్కువైంది. దీంతో జహీరాబాద్ ప్రాంతంలో కుసుమ నూనె తీసే మిల్లులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నూనెను ఇష్టపడే వారు రైతుల వద్ద కుసుమలు కొనుగోలు చేసుకొని మిల్లుల వద్ద నూనె పట్టించుకొని సంవత్సరం పాటు నిల్వ ఉంచుకుంటున్నారు. కుసుమ సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో ఆశించిన మేర సాగు విస్తీర్ణం పెరగడం లేదు.

**అంతర పంటగా సాగు**

తక్కువ పెట్టుబడి, నీటి తడులు లేకుండా సాగు చేసే పంటల్లో తెల్ల కుసుమ కూడా ఒక్కటి. ఏక పంట కాకుండా శనగ, తెల్ల జొన్న, ధనియాలు తదితర పంటల్లో అంతర పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. పూర్వీకుల కాలం నుంచి ఈ పంటను సాగు చేస్తున్నారు. నూనెలో ఆయుర్వేద గుణాలు ఉండటంతో ఇదే వాడే వారు. మార్కెట్‌లోకి వివిధ రకాల పంట నూనెలు తక్కువ ధరకు దొరుకుతుండడంతో కుసుమకు డిమాండ్ తగ్గడం వల్ల సాగు విస్తీర్ణం పడిపోయింది. ఇటీవల కాలంలో ఈ నూనె ఉపయోగంపై ప్రజల్లో అవగాహన పెరగడంతో మళ్లీ డిమాండ్ పెరిగింది. పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతోపాటు గిట్టుబాటు ధర లభిస్తుంది. జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో తెల్ల కుసుమ పంట సాగవుతుంది. ఎకరానికి రూ. 7 వేల వరకు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో క్వింటాల్ కుసుమలకు రూ. 6 వేల ధర పలుకుతుంది. వ్యవసాయ అధికారులు కూడా యాసంగిలో కుసుమ పంటను సాగు చేసుకోవాలని చెబుతున్నారు.

**సాగు విధానం**

తెల్ల కుసుమ పంట సాగుకు నీరు నిల్వ లేని నల్లరేగడి పొలాలు అనుకూలం. అంతర పంటగా సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుంది. 120 నుంచి 140 రోజుల్లో పంట కోతకు వస్తుంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు పంట సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 7 నుంచి 8 క్వింటాల్ వరకు దిగుబడి వస్తుంది. రోగాలను తట్టుకునేందుకు కిలో విత్తనానికి 2 గ్రాముల క్యాప్టన్ లేదా 1 గ్రాము కబ్బెన్జిమ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. పూత దశలో ఒక తడి నీరు పెడితే చాలు మంచి దిగుబడి వస్తుంది.



జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న తెల్ల కుసుమ

### కుసుమ సాగు లాభదాయకం



తెల్ల కుసుమ సాగు వల్ల రైతులకు లాభం కలుగుతుంది. ఇటీవల కాలంలో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి మంచిదని ప్రజలు కూడా ఈ నూనెను ఎక్కువగా వాడుతున్నారు. మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుంది. ఆసక్తి కలిగిన రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

–భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్